నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 10-5-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 228 | పేజీలు:4 | వెల: రూ.1/-

హైదరాబాద్‌లో గ్రిడ్ డైనమిక్స్ ఏర్పాటు : మంత్రి కేటీఆర్

హైదరాబాద్,మే 9: మల్టీ నేషనల్ కంపెనీలకు హైదరాబాద్ కేంద్రంగా నిలిచిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను గ్రిడ్ డైనమిక్స్ సీఈవో లివ్ చిట్జ్‌తో పాటు ఆ కంపెనీ ప్రతినిధులు కలిశారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. గ్రిడ్ డైనమిక్స్ భారత్‌లో మొదటి యూనిట్‌ను ఏర్పాటు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యూనిట్ ఏర్పాటుతో హైదరాబాద్‌లో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందన్నారు కేటీఆర్.

12 నుంచి ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్, జూన్ రెండో వారంలో రిజల్ట్!

హైదరాబాద్,మే 9: ఈ నెల 12 నుంచి ఇంటర్మీడియట్ స్పాట్ వ్యాల్యుయేషన్ (పేపర్లు దిద్దడం) ప్రక్రియ ప్రారంభం కానుంది. 12న ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం సంస్కృతం పేపర్లు దిద్దనున్నారు. ఈనెల 22న ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్ పేపర్లు దిద్దనున్నారు. 26న ఫిజిక్స్, ఎకనామిక్స్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పేపర్లు, 28న కెమిస్ట్రీ, కామర్స్, 31న హిస్టరీ, బాటనీ, జూవాలజీ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ పేపర్లు దిద్దనున్నారు. ఇక జూన్ రెండో వారంలో ఫలితాలను ప్రకటించే అవకాశం ఉంది.

ఈ స్పాట్ వ్యాల్యూయేషన్‌లో చీఫ్ ఎక్జామినర్లు, అసిస్టెంట్ ఎక్జామినర్లు, సబ్జెక్ట్ ఎక్సపర్టులు, అధ్యాపకులు ఇతర అధికారులు పాల్గొనున్నారు. మొత్తం 14 సెంటర్లలో ఇంటర్ పేపర్లను దిద్దనున్నారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. పరీక్ష ఫలితాలను పరీక్షలు పూర్తయిన నెల రోజుల్లో ప్రకటిస్తామని ఇంటర్ విద్యా కమిషనర్ ఉమర్ జలీల్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనెల 24న ఇంటర్ పరీక్షలు ముగియనున్నాయి.

రాత్రి సేవలంటూ ఆర్టీసీ బస్సుల్లో రెట్టింపు వసూలు

హైదరాబాద్,మే 9: సికింద్రాబాద్ రైలేస్టేషన్ నుంచి కూకట్‌పల్లి, కొండాపూర్, ఎల్బీనగర్, ఉప్పల్, మెహిదీపట్నం తదితర ప్రధాన రూట్లలో రాత్రి 10గంటల తరాత నైట్ రైడర్ పేరిట గ్రేటర్ జోన్ టీఎస్ఆర్టీసీ కొత్త సర్వీసులను నెలరోజుల క్రితం ప్రారంభించింది. ఈ బస్సుల్లో స్పెషల్ టారీఫ్ పేరిట సాధారణ చార్జీల కన్నా రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఇందులో కన్సెషనల్ బస్‌పాస్‌లే కాకుండా రోజు వారి, నెలవారి బస్‌పాసులను సైతం అనుమతించడం లేదు. సాధారణంగా ఆర్టీనరీ బస్ పాస్ తీసుకుంటే అన్ని ఆర్డినరీ సర్వీసులను, మెట్రో పాస్ తీసుకుంటే ఆర్డినరీతో పాటు అన్ని మెట్రో సర్వీసులను, ఏసీ బస్ పాస్ తీసుకుంటే అందులో అన్ని సర్వీసులను పొందువరుస్తారు.

అయితే నైట్ సర్వీస్ పేరిట సింహ భాగం ఆర్డినరీ సర్వీసుల నే నడుపుతున్నారు. కాని ఇందులో డే పాస్‌తో పాటు ఏలాంటి పాస్‌లను అనుమతించడం లేదు. గతంలో ఈ రూట్లలో రాత్రి 12గంటల వరకు నడిచే సర్వీసులను రద్దు చేసి వీటిని ప్రవేశ పెట్టడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నైట్ రైడర్ బస్సు చార్జీల కన్నా ఆటో చార్జీలే చౌకగా ఉన్నాయని ప్రయాణీకులు అంటున్నారు. ఒకప్పుడు హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ సిటీ బస్సుల కోసం ఎదురు చూసిన ప్రయాణీకులు చార్జీల బాదుడుకు బెంబేలెత్తుతున్నారు. పెరుగుతున్న ఇంధన ధరల వల్ల వస్తున్న నష్టాలను అధిగమించేందుకు ఆర్టీసీ గ్రేటర్ జోన్ కొత్త కొత్త పేర్లతో ప్రవేశ పెడుతున్న సర్వీసులు సామాన్య ప్రజలకు భారంగా పరిణమించాయి.

తెలంగాణకు వచ్చే మూడ్రోజులపాటు వర్ష సూచన

హైదరాబాద్,మే 9: తెలంగాణలో వచ్చే మూడ్రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విదర్భ నుంచి కర్ణాటక వరకూ ఉపరితల ద్రోణి ఆవరించి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. తూర్పు బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది.

విషాద ఘటన.. కొడుకు పుట్టినరోజు సెలబ్రేట్ చేయాలనుకున్న ఆ తల్లి జీవితం చివరికిలా..

బెంగళూరు, 9:: ఆర్థిక ఇబ్బందులు ఆ అమ్మను నైరాశ్యంలోకి నెట్టేశాయి. కొడుకు పుట్టినరోజును జరిపేందుకు కూడా డబ్బు లేకపోవడంతో మానసికంగా కుంగిపోయింది. చివరకు రెండేళ్ల కొడుకును, మూడేళ్ల కూతురిని ఆ పేదరికంలోనే వదిలేసి ఆ అమ్మ ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. ఈ విషాద ఘటన కర్ణాటకలోని బెంగళూరు పట్టణంలో వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని రామనగర జిల్లా కనకపుర తాలూకాలోని గిరిగౌడనదొడ్డి గ్రామానికి చెందిన తేజస్విని అనే మహిళ శుక్రవారం ఇంట్లో ఉన్న ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

ఆమె తమ్ముడు అజయ్ కుమార్ ఈ ఘటనపై స్పందిస్తూ.. తన సోదరి తేజస్వినికి, శ్రీకాంత్ అనే వ్యక్తికి కొన్నేళ్ల క్రితం వివాహం జరిగిందని చెప్పాడు. వీరికి దీక్షా, ధనుష్ అనే ఇద్దరు పిల్లలు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వ్యవసాయంలో ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో శ్రీకాంత్ లోన్ తీసుకుని ఫౌల్ట్రీ ఫామ్ పెట్టాడు. అయితే.. ఫౌల్ట్రీ ఫామ్ వ్యాపారం శ్రీకాంత్‌కు భారీ నష్టాలను మిగిల్చింది. అతని కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక సమస్యల్లోకి నెట్టేసింది. ఈ పరిణామాలతో శ్రీకాంత్ భార్య తేజస్విని తీవ్ర మనస్తాపానికి లోనైంది. అయితే.. ఈ సమస్యలు ఎప్పుడూ ఉండేవేనని గుండె దిటవు చేసుకుని గడుపుతున్న ఆమె కొడుకు రెండో పుట్టినరోజు చేయాలని భావించింది. ఈ విషయాన్ని భర్తతో చెప్పింది.

కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో ఈ పరిస్థితుల్లో పుట్టినరోజు సెలబ్రేషన్స్ లాంటివి వద్దని, తాను మైసూరు నుంచి వచ్చే వరకూ వేచి ఉండమని భార్య తేజస్వినికి శ్రీకాంత్ చెప్పాడు. ఈ పరిణామంతో తీవ్ర మనస్తాపానికి లోనైన తేజస్విని కొడుకు పుట్టినరోజు చేసేందుకు కూడా ఆలోచించాల్సిన దుస్థితి వచ్చిందని మానసికంగా కుంగిపోయింది. ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో గ్రామస్తులకు ఈ విషయం తెలిసింది. ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

చరిత్రలో నేటినిజం

మన బస్తీ-మన బడితో మారనున్న సర్కార్ బడుల రూపురేఖలు: మంత్రి తలసాని

హైదరాబాద్,మే 9:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మన బస్తీ-మన బడి కార్యక్రమంతో సర్కారు బడుల రూపు రేఖలు పూర్తిగా మారిపోతాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని రాజ్ భవన్ స్కూల్, అమీర్‌పేట ధరం కరం రోడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మన బస్తీ-మన బడి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నేడు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. జిల్లాలోని మొత్తం 690 పాఠశాలలు ఉండగా మొదటి విడుతలో భాగంగా 239 స్కూళ్లలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలోని 26,065 పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అన్ని వసతులు కల్పించేకుగాను మన ఊరు-మన బడి, పట్టణాల్లో అయితే మన బస్తీ-మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. దీనికోసం రూ.7,259 కేటాయించారని వెల్లడించారు. మొదటి విడుతలో భాగంగా 9123 పాఠశాలల అభివృద్ధికి రూ.3,497 కోట్లు మంజూరు చేశారన్నారు.

రాబోయే ఆరు నెలలు యువత సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి : మంత్రి కేటీఆర్

మహబూబ్ నగర్, మే 9: నిరుద్యోగ యువత రాబోయే ఆరు నెలల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండి సీరియస్‌గా ప్రిపరేషన్ పూర్తి చేసి ఉద్యోగాలు సాధించాలని మంత్రి కేటీఆర్ సూచించారు. సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎక్స్పో ప్లాజా వద్ద టీఆర్ఎస్ పార్టీ జెండాను మంత్రి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఆయన ఆవిష్కరించారు.అనంతరం ఎక్స్పో ప్లాజాలో శాంతా నారాయణ గౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌లో ఉద్యోగార్థులకు కేటీఆర్ పోటీ పరీక్షల పుస్తకాలను అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ పట్టణం పూర్తి స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.మంత్రి శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి మేరకు మహబూబ్ నగర్ పట్టణానికి అవసరమైన నిధులు మున్సిపల్ శాఖ ద్వారా మంజూరు చేస్తామని ఆయన వెల్లడించారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన మేర తమ సహకారం ఉంటుందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ సుమారు 90 వేల ఉద్యోగాలను భర్తీ చేసే ప్రక్రియ చేపట్టారని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు ఇంతియాజ్, వాల్యా నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే సుష్మా స్వరాజ్ మాట నిలబెట్టు : కేటీఆర్

నారాయణపేట, , మే 9 : బీజేపీ నాయకత్వంపై రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. పచ్చి అబద్ధాలతో పాలమూరు రైతాంగాన్ని మోసం చేసేందుకు బీజేపీ నాయకులతో పాటు ఇతర పార్టీలు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. పాలమూరు పచ్చబడుతుంటే కొంత మంది కండ్లు ఎర్రబడుతున్నాయి.. చెరువులు నిండుతుంటే కొంతమంది గుండెలు మండుతున్నాయని కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే సుష్మా స్వరాజ్ ప్రకటించిన మాదిరిగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా కల్పించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పనులకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు.

కృష్ణా జలాల్లో నీటి వాటాను తీసుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలం చెందిందని కొందరు పనికిమాలిన మాటలు, పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారికంగా లెక్కలు చెప్తున్నా.. కృష్ణా నదిలో ఉమ్మడి ఏపీలో 811 టీఎంసీలు మనకు కేటాయింపులు ఉండే. రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేండ్లు అవుతోంది.. అప్పట్నుంచి కేంద్రాన్ని అడుగుతున్నాం.. కృష్ణా జలాల్లో 811 టీఎంసీల హక్కు ఇవ్వాలని, పంపకాలు తేల్చాలని అడిగాం. ప్రాజెక్టులు కట్టకుండా సతాయించిన జిల్లా పాలమూరు జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాకు 575 టీఎంసీల నీటిని ఇవ్వండని 8 ఏండ్ల నుంచి కోరుతూనే ఉన్నాం. స్వయంగా మోదీని కేసీఆర్ అడిగారు. అయినా ఉలుకుపలుకు లేదు. సెక్షన్ 3 కింద బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు రెఫర్ చేయాలని అడిగాం. దున్నపోతు మీద వానపడ్డట్టు ఉంది. ఉలుకు పలుకు లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

పాదయాత్రలు చేస్తూ పచ్చి అబద్ధాలు..

పాలమూరు జిల్లాకు చేసిందేమీ లేక పోగా పాదయాత్రలు చేస్తూ పచ్చికారుకూతలు, పచ్చి అబద్ధాలతో పాలమూరు రైతాంగాన్ని మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ నిప్పులు చెరిగారు. సిగ్గులేని మాటలు మాట్లాడుతు న్నారు. 299 టీఎంసీలకు సీఎం కేసీఆర్ ఒప్పుకున్నారని అబద్ధాలు చెబుతున్నారు. దమ్ముంటే, పలుకు బడి ఉంటే, మోదీకి చిత్తశుద్ధి ఉంటే.. తెలంగాణపై ప్రేమ ఉంటే.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వండి. సుష్మా స్వరాజ్ హైదరాబాద్‌లో సభ పెట్టి పాలూమురుకు జాతీయ హోదా ఇస్తామని ప్రకటించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే సుష్మా మాట నిలబెట్టి.. పాలమూరుకు జాతీయ హోదా ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అమిత్ షా జాతీయ హోదా ఎక్కడ?

పక్కనే ఉన్న కర్ణాటకలోని తుంగభద్ర నదిపై ఉన్న అప్పర్ భద్రకు జాతీయ హోదా ఇస్తరు. కానీ మేం అడిగితే వినబడనట్టు ముందుకు పోతరని అమిత్ షాను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. అమిత్ షాకు నీతి, నిజాయితీ, సిగ్గు లజ్జ ఉంటే తెలంగాణకు కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు కేటాయించి, వెంటనే పాలమూరుకు జాతీయ హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉత్తగ మాటలు చెప్పుడు కాదని అమిత్ షాపై కేటీఆర్ ధ్వజమెత్తారు.

ఆర్థికంగా సుసంపన్నం చేయాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పం : మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట, మే 9: దళితులను ఆర్థికంగా సుసంపన్నం చేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

సోమవారం చివ్వెంల మండలం తుల్జారావు పేటలో ఆయన దళిత బంధు పథకాన్ని ప్రారంభించారు.

లబ్ధిదారులకు ఆయా యూనిట్లను అందజేసి వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందన్నారు.

ప్రజలు ఏమి కోరుకుంటున్నారో పాలకుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ అదే అమలు పరుస్తున్నారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి కేసీ ఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన దళితబంధు పథకం కుడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందించిందేనని స్పష్టం చేశారు.

దళితబంధు పథకంతో దళితులు ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటు సమాజాన్ని నిర్దేశించే వ్యక్తులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

అనంతరం దళిత బంధు లబ్ధిదారులతో కలసి ఆయన సహపంక్తి భోజనం చేశారు.

అనంతరం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఎంపీపీ ధారావత్ బాబు నాయక్, జడ్పీటీసీ సంజీవ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడు మనకిచ్చిన గొప్పవరం అమ్మ:సునీత లక్ష్మారెడ్డి

హైదరాబాద్,మే 9: దేవుడు అన్ని చోట్లా ఉండలేక అమ్మని సృష్టించాడని తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునీత లక్ష్మారెడ్డి(బబినితిబిజీ శ్రీజీలీఎజీ తీవటటఎ) అన్నారు. అమ్మలందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం గ్రీన్ పార్క్ హోటల్ లో సోనమ్ మిట్టల్ మహిళ సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు, బాలికలకు అవార్డులు మరియు నగదు బహుమతులను అందజేశారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలను ప్రత్యేకంగా గౌరవిస్తూ వారికి సమాన హక్కులు కల్పిస్తోందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మహిళల కోసం షి టీమ్స్, భరోసా సెంటర్స్, సఖి సెంటర్స్, వీ-హబ్ ఏర్పాటు చేసిందని.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్(ఎఇతీ) మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమల్లోకి తెచ్చారని చైర్ పర్సన్ గుర్తుచేశారు. కమిషన్ మహిళలకు రక్షణ హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు అండగా నిలుస్తుందన్నారు. మహిళలు ఏ సమస్య వచ్చినా అధైర్యపడకుండ దృఢంగా ఉండాలని, ప్రతి సమస్యకి ఒక పరిష్కారం ఉంటుందని అన్నారు. టెక్నాలజీ పరంగా సమాజం ఇంత ముందుకు వెళ్తున్నా ఇంకా మహిళలపై దాడులు జరగడం చాలా బాధాకరం అని చైర్ పర్సన్ అన్నారు.

అనంతరం రాష్ట్ర మహిళా కమిషన్ మహిళల రక్షణకై చేస్తున్న కార్యక్రమాల్ని చైర్ పర్సన్ వివరించారు. మహిళలకు ఏ సమస్యా వచ్చిన తక్షణమే మహిళ కమిషన్ దృష్టికి తీసుకురావాలని చైర్ పర్సన్ కోరారు. అలాగే ఇంట్లో సమస్యలతో కమిషన్ కి రాలేకపోయే వారికీ సోషల్ మీడియా ద్వారా కూడా కంప్లైంట్ చేయవచ్చని గుర్తు చేసారు. మీరు ఫేస్ బుక్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్ @SCWTelangana ద్వారా, ఈమెయిల్ elanganastatewomenscommission@gmail.com, హెల్ప్ లైన్ 181 లేదా కమిషన్ వాట్సప్ నంబర్ 9490555533 ద్వారా కూడా మహిళలకు జరిగే అన్యాయాన్ని కమిషన్ దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రెటరీ కృష్ణ కుమారి, ఎఫ్.ఐ.సి.సి.ఐ చైర్ పర్సన్ శుభ్ర మహేశ్వరి మరియు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంక ప్రధాని మహింద్ర రాజపక్స రాజీనామా

కొలంబో, మే 9:: పొరుగు దేశం శ్రీలంక ప్రధాని మహింద రాజపక్స సోమవారం పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని స్థానిక మీడియా తెలిపింది. ఆయనతో పాటు ఆరోగ్యశాఖ మంత్రి రాజీనామా లేఖను అధ్యక్షుడికి అందజేశారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం మధ్య ప్రజల నుంచి వ్యక్తమవుతున్న నిరసన వ్యక్తమవుతున్నది. మరో వైపు ప్రతిపక్షాలు సైతం ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేయడంతో పాటు రాజీనామాకు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో ఆయన పదవి నుంచి తప్పుకున్నట్లు తెలుస్తున్నది. మహింద రాజపక్స రాజీనామా నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంక్షోభం పరిష్కారమయ్యే వరకు అధ్యక్షుడు గోటబయ రాజపక్స తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారు.

ఇటీవల గోటబయ అధ్యక్షతన రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కేబినెట్ సమావేశంలో ప్రధాని పదవికి రాజీనామా చేసేందుకు అంగీకరించారని, దీనిపై సోమవారం ప్రకటన చేస్తారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆయన రాజీనామా చేశారు. విదేశీ మారకద్రవ్యం నిలువలు తగ్గిపోవడంతో శ్రీలంక ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నది. దీంతో ధరలు భారీగా పెరగడంతో ఆహార సంక్షోభం నెలకొన్నది. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరో వైపు విద్యుత్ కోతలు భారీగా విధిస్తుండడంతో జనం రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగుతున్నారు. పలు చోట్ల ఆంక్షలు విధించినా.. లెక్క చేయకుండా ప్రధాని మహింద రాజపక్స, అధ్యక్షుడు గోటబయ రాజపక్సకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్యం అనంతరం శ్రీలంకలో ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నది. సోమవారం ప్రధాని పదవికి మహింద రాజపక్స పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు ఆరోగ్యశాఖ మంత్రి ప్రొఫెసర్ చన్నా జయసుమన సైతం రాజీనామా లేఖను అధ్యక్షుడికి అందజేశారు. మహింద రాజపక్స ప్రధాని పదవి నుంచి వైదొలగుతున్నారనే వార్తలతో అధ్యక్షుడి కార్యాలయం వెలుపలు ఘర్షణ చెలరేగింది. ప్రభుత్వ అనుకూల వర్గాలు నిరసనకారులపై దాడి చేయడంతో 20 మందికిపైగా గాయపడ్డారు. ఆ తర్వాత ప్రభుత్వ దేశవ్యాప్తంగా కర్ఫ్యూను విధించింది. రాజధానిలో సైన్యాన్ని మోహరించింది.

పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
చిత్రవాణి ఆడియో వీడియో రికార్డింగ్ విభాగం, హైదరాబాదు
భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
సంయుక్త సమర్పణలో
మాతృ దినోత్సవం సందర్భంగా ' షష్టి పూర్తి ' కలాలకు
మాతృవందనం

ముఖ్య అతిథి
శ్రీమతి కల్వకుంట్ల కవిత
శాసనమండలి సభ్యురాలు

అధ్యక్షులు
ఆచార్య తంగెడ కిషన్‌రావు
ఉపాధ్యక్షులు, పా.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం

గౌరవ అతిథి
మామిడి హరికృష్ణ
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ

Digital Support by : VISION 99
తేది : 11-05-2022 ఉదయం 10.30 గంటలకు
వేదిక : డా. ఎన్.టి.ఆర్. కళామందిరం, పా.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం

శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి
డిప్యూటీ డైరెక్టర్, చిత్రవాణి స్టూడియో

ఆచార్య భట్టు రమేష్
రిజిస్ట్రార్, పా.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం

సుస్థిరాభివృద్ధికి సంఘటితమైన యూరోపియన్ దేశాలు..!

(09 మే 'యూరోప్ దినం' సందర్భంగా)

యూరోపియన్ యూనియన్ (ఈయు) సమాజం 09 మే రోజున 'యూరోప్ దినోత్సవాన్ని (యూరోప్ డే)' ఘనంగా నిర్వహించుకోవడానికి యూరోప్ దేశాలు సిద్ధంగా ఉన్నారు. యూరోప్‌లో 44 దేశాలు ఉండగా, యూరోపియన్ యూనియన్‌లో జర్మనీ, ఫ్రాన్స్, స్పేయిన్, స్వీడెన్, డెన్మార్క్, బెల్జియమ్, బర్గేరియా లాంటి 27 దేశాలు సభ్యులుగా ఉన్నారు. 2002లో ఈయూ దేశాలు 'యూరో' కరెన్సీని ఆమోదించి అమలులోకి తేవడం ఓ గొప్ప విశేషం. యూరోప్ సమాజం అనేక స్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకొని, గతాన్ని విశ్లేషించుకొని రేపటి వెలుగుల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. ఈయూ పార్లమెంట్, కమిషన్, ఇతర ప్రముఖ సంస్థలతో పాటు ప్రపంచ పౌరసమాజం కూడా యూరోప్ దినం పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. యూరోప్‌లో రాజకీయ ఏకీకరణ కోసం 09 మే 1950లో ప్రయత్నించిన 'రాబర్ట్ షుమన్' ప్రతిపాదించిన 'షూమన్ డిక్లరేషన్'కు గుర్తుగా 09 మే రోజున 'యూరోప్ డే'గా 1985 నుంచి నిర్వహించుట జరుగుతున్నది. షూమన్ ప్రతిపాదనలతోనే 'యూరోపియన్ యూనియన్' భావన మె?లకెత్తింది. యూరోప్‌లోని ఫ్రెంచ్, జర్మనీ దేశాలు బొగ్గు, స్టీల్ పరిశ్రమలను ఏకం చేసి "యూరోపియన్ కోల్ అండ్ స్టీల్ కమ్యూనిటీ' నీడన చేర్చి ఉత్పత్తులు చేయడం 18 ఏప్రిల్ 1951న ప్రారంభమైంది. యూరోప్ దినం వేదికగా యూరోపియన్ సమాజం చర్చలు, ఉపన్యాసాలు, నాటికలు, కచేరీలు, వేడుకలు లాంటి పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. ఆధునిక యూరోపియన్ సమాజం ముందున్న సవాళ్ళను విశ్లేషిస్తూ, ప్రజాక్షేమం వైపుకు ప్రగతి దారులు వేయుటకు కృషి చేయటం జరుగుతుంది. 29 జూన్ 1985న యూరప్ డే, యూరోప్ పతాకం కూడా అమోదించుట జరిగింది.

'యూరోప్‌లో శాంతి, ఏకత (పీస్ అండ్ యునిటీ ఇన్ యూరోప్)' కోసం 05 మే రోజున 'కౌన్సిల్ ఆఫ్ యూరోప్', 09 మే రోజున 'యూరోపియన్ యూనియన్' ఆవిర్భావ ఉత్సవాలు జరుపుకుంటారు. 05 మే 1949న 'కౌన్సిల్ ఆఫ్ యూరోప్' ఏర్పడిన తరువాత 1964 నుంచి 'యూరోప్ కౌన్సిల్ దినం' నిర్వహించబడుతున్నది. యూరోప్ డే వేడుకల్లో భాగంగా బ్రెజెల్స్, స్ట్రాస్‌బర్గ్ నగరాల్లోని ఈయూ సంస్థలను (యూరోపియన్ పార్లమెంట్, కౌన్సిల్ ఆఫ్ ఈయూ, యూరోపియన్ కమిషన్, యూరోపియన్ ఎకనమిక్ అండ్ సోషల్ కమిటీ, యూరోపియన్ కమిటీ ఆఫ్ ది రీజియన్) ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంచుట జరుగుతుంది. షూమన్ డిక్లరేషన్ 71వ వార్షికోత్సవం, 76వ ప్రపంచ యుద్ధం-2 ముగింపు వేడుకలను నిర్వహించే ప్రత్యేకతలు ఈ ఏడాది 'యూరోప్ డే-2021' ఉత్సవాలకు ఉండడం విశేషం. ఈయూ సభ్యదేశాలు ఆధునికత వైపుకు కలిసికట్టుగా ఐక్యతా మంత్రంతో సమగ్రాభివృద్ధి, శాంతియుత సహజీవనం దిశగా అడుగులు వేస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

వ్యాపారాన్ని సులభతరం చేయడానికి సంబంధించి ముసాయిదా నోటిఫికేషన్ జారీ - ట్రేడ్ సర్టిఫికేట్.

న్యూఢిల్లీ, మే 9:వాణిజ్య ధృవీకరణ పత్రానికి సంబంధించిన సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్ 1989లోని కొన్ని నిబంధనలలో సవరణలకు సంబంధించి రోడ్డు రవాణా ఉ రహదారుల మంత్రిత్వ శాఖ 5.5.2022 తేదీన ముసాయిదా నోటిఫికేషన్‌ను ప్రచురించింది. రిజిస్టర్ కాని లేదా తాత్కాలికంగా నమోదు కాని వాహనాల విషయంలో మాత్రమే ట్రేడ్ సర్టిఫికేట్ అవసరం. ఈ తరహా వాహనాలు మోటారు వాహనాల డీలర్/ తయారీదారు/ దిగుమతిదారు లేదా రూల్ 126లో పేర్కొన్న టెస్ట్ ఏజెన్సీ లేదా కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న ఏదైనా సంస్థ ఆధీనంలో మాత్రమే ఉంటాయి. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"ని ప్రోత్సహించే ప్రయత్నంలో, అటువంటి ఏజెన్సీ వాహన్ పోర్టల్‌లో ఒకే అప్లికేషన్‌లో బహుళ రకాల వాహనాల కోసం ఎలక్ట్రానిక్‌గా ట్రేడ్ సర్టిఫికేట్ మరియు ట్రేడ్ రిజిస్ట్రేషన్ మార్కుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రతిపాదించబడింది. దరఖాస్తు చేసుకున్న ట్రేడ్ రిజిస్ట్రేషన్ మార్కుల సంఖ్య ఆధారంగా ఫీజులను క్రమబద్ధీకరించడం కూడా ప్రతిపాదించబడింది. ఇంకా, ట్రేడ్ సర్టిఫికేట్ మరియు రిజిస్ట్రేషన్ మార్కులను ఆన్‌లైన్‌లో అంటే ఎలక్ట్రానిక్‌గా పోర్టల్‌లో కేటాయించాలని ప్రతిపాదించబడినందున, ట్రేడ్ సర్టిఫికేట్ యొక్క నష్టం లేదా ధ్వంసం మరియు నకిలీ కోసం దరఖాస్తుకు సంబంధించిన సమ్మతి భారం తీసివేయబడింది. ట్రేడ్ సర్టిఫికేట్ యొక్క చెల్లుబాటును కూడా 12 నెలల నుండి 5 సంవత్సరాలకు పెంచబడింది.

తెలంగాణలోని పథకాలు బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఎందుకు లేవు

రంగారెడ్డి,మే 9:ధరలు పెంచి పేదల నడ్డీ విరుస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని తెలిపారు. ఆదివారం ఆమె కందుకూరులో మాట్లాడుతూ పెంచిన నిత్యావసర ధరలు తగ్గించే వరకు బీజేపీ నేతలను తిరుగనివ్వ వద్దని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కందుకూరు, మహేశ్వరం మండలాల్లో ఎందుకు పాదయాత్ర చేస్తున్నాడని ప్రశ్నించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, దళిత బంధు, పింఛన్లు, రైతులకు 24గంటల ఉచిత కరెంట్, ఇలా అనేక ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తున్నదని, మరి ఈ పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడంలేదో బండి సంజయ్ తన పాదయాత్రలో చెప్పాలని డిమాండ్ చేశారు.

దీనిపై సమాధానం చెప్పే వరకు ప్రజలు అడుగడుగునా నిలదీయాలని తెలిపారు. బండి సంజయ్ పాదయాత్రను నిరసిస్తూ ఈ నెల 15న సాయంత్రం 4 గంటలకు బండగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గాల్లోని ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కప్పాటి పాండురంగారెడ్డి, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మహేశ్వరం ఎంపీపీ రఘుమారెడ్డి, టీఆర్ఎస్ పార్టీ నాయకులు మన్నె జయేందర్ ముదిరాజ్, వట్నాల ఈశ్వర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కృష్ణరాంభూపాల్‌రెడ్డి, చంద్రయ్య, అశోక్, సామ ప్రకాశ్ రెడ్డి, సోలిపేట అమరేందర్‌రెడ్డి, గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, అందుగుల సత్యనారాయణ, చంద్రశేఖర్, సాయిలు, అంజయ్యగౌడ్, దామోదర్‌గౌడ్, పాండుగౌడ్, తాళ్ల కార్తిక్, విఘ్నేశ్వర్‌రెడ్డి, బొక్క దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ, సదాలక్ష్మి పుల్లారెడ్డి, ఇందిరమ్మ దేవేందర్, జయమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ చట్టం, 2009 డీక్రిమినైజేషన్ గురించి చర్చించడానికి జాతీయ వర్క్‌షాప్

న్యూఢిల్లీ, మే 9:వినియోగదారుల వ్యవహారాల విభాగం లీగల్ మెట్రాలజీ చట్టం, 2009 యొక్క డీక్రిమినలైజేషన్ సమస్యపై అందరు వాటాదారుల నుండి అభిప్రాయాలను తీసుకునే ఉద్దేశ్యంతో 9 మే 2022న ఒక రోజు 'నేషనల్ వర్క్‌షాప్ ఆన్ లీగల్ మెట్రాలజీ యాక్ట్, 2009'ని నిర్వహిస్తోంది. వినియోగదారులు మరియు పరిశ్రమలలో సమతుల్యత, అనవసరమైన జోక్యాన్ని తొలగించడం ద్వారా సులభంగా వ్యాపారం చేయడం కోసం లీగల్ మెట్రాలజీ చట్టం, 2009 యొక్క డీక్రిమినైజేషన్ పరిగణించబడుతోంది.

వీటితో పాటు వ్యాపారాలపై భారం పెరగకుండా మరియు ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగించకుండా ప్రామాణికం కాని బరువులు ఉ కొలతలు మరియు తప్పుగా బహిర్గతం చేయడం ద్వారా వినియోగదారుని స్వల్పంగా మార్చకుండా చూసుకోవడం వర్క్‌షాప్ యొక్క లక్ష్యం. ఈ వర్క్‌షాప్ యొక్క ఉద్దేశ్యం వ్యాపారాన్ని సులభతరం చేయడానికి మరియు వినియోగదారుల ప్రయోజనాలను కాపాడడానికి లీగల్ మెట్రాలజీ చట్టాన్ని నేరరహితం చేయడం ద్వారా విజయాన్ని గుర్తించడానికి వాటాదారుల సంప్రదింపులు జరపడం ఈ సదస్సు ఉద్దేశం.

ఈ వర్క్‌షాప్‌కు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజాపంపిణీ, జౌళి, వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అధ్యక్షత వహిస్తారు. వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ఉ ప్రజాపంపిణీ, పర్యావరణం, అటవీ ఉ వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ అశ్విని చౌబే మరియు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ఉ ప్రజాపంపిణీ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీమతి సాధ్వి నిరంజన్ జ్యోతి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. .

లీగల్ మెట్రాలజీ చట్టం, 2009 యొక్క డీక్రిమినలైజేషన్ పరిశీలనలో కీలకమైన అంశాలు: వ్యాపారాలపై భారాన్ని తగ్గించడం మరియు పెట్టుబడిదారులలో విశ్వాసాన్ని కలిగించడం; ఆర్థిక వృద్ధి మరియు వినియోగదారుల ప్రయోజనాల రక్షణపై దృష్టి పెట్టడం; నేర బాధ్యతను విధించడంలో (మాలాఫైడ్/క్రిమినల్ ఇంటెంట్) ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది - కాబట్టి, నిర్లక్ష్యం లేదా అనుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో పోలిస్తే మోసం యొక్క స్వభావాన్ని అంచనా వేయడం చాలా కీలకం; మరియు నిబంధనలు పాటించకుండా తరచూ నేరాలకు పాల్పడేవారిని గుర్తించడంమంత్రులు, కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వాల లీగల్ మెట్రాలజీ కంట్రోలర్లు, పరిశ్రమలు,వీసీలోలు మొదలైన వారితో కూడిన అందరు వాటాదారులు వర్క్‌షాప్‌లో పాల్గొంటారు.

అమిత్ షా ఆదేశాల మేరకు సంక్షేమ, పునరావాస బోర్డు (వార్బ్) ద్వారా 'సిఏపిఎఫ్ పునరావాస్' పోర్టల్ ప్రారంభించిన హోం మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, మే 9:పదవీ విరమణ చేసిన తర్వాత ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థల్లో ఉపాధి పొందేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర సాయుధ పోలీసు దళం , అస్సాం రైఫిల్స్ సిబ్బందికి సహకారం అందించాలన్న లక్ష్యంతో హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఆదేశాల మేరకు సంక్షేమ, పునరావాస బోర్డు (వార్బ్) ద్వారా హోం మంత్రిత్వ శాఖ 'సిఏపిఎఫ్ పునరావాస్' పోర్టల్ ను ప్రారంభించింది. ఈ పోర్టల్ లో తమ వ్యక్తిగత వివరాలు, అనుభవం నమోదు చేసుకుని అర్హతకు తగిన ఉద్యోగాన్ని తమకు నచ్చిన ప్రాంతంలో పొందేందుకు పదవీ విరమణ చేసిన సిబ్బందికి అవకాశం కలుగుతుంది. ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థల రిజిస్ట్రేషన్ కోసం హోం మంత్రిత్వ శాఖ కోసం ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల నియంత్రణ చట్టం కింద హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా ఒక పోర్టల్‌ను నిర్వహిస్తోంది. కేంద్ర సాయుధ పోలీసు దళం సిబ్బంది వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నది.

తానూ నిర్వహిస్తున్న రెండు వెబ్ సైట్లను హోం మంత్రిత్వ శాఖ అనుసంధానం చేసింది. దీనివల్ల 'సిఏపిఎఫ్ పునర్వాస్' ద్వారా పునరావానం కోసం పదవీ విరమణ చేసిన సిబ్బంది పొందుపరిచిన వివరాలను ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల నియంత్రణ చట్టం కింద హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలు పరిశీలించేందుకు వీలవుతుంది. దీనితో ఉద్యోగార్థులు, ఉపాధి కల్పించే సంస్థలు ఒక వేదిక ద్వారా పని చేయగల ుగుతాయి. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఈ చర్యతో ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలకు 'సిఏపిఎఫ్ పునర్వాస్' కింద అవసరమైన సమాచారం అందుబాటులోకి వస్తుంది.భద్రతా సేవలు అవసరమయ్యే వ్యాపార సంస్థల సంఖ్య పెరగడంతో ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థల సంఖ్య ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగింది. సంస్థల సంఖ్య పెరగడంతో భద్రతా సిబ్బంది అవసరం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో పదవీ విరమణ చేసి తిరిగి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది వివరాలను హోం మంత్రిత్వ శాఖ పోర్టల్ ద్వారా తీసుకుని అనుభవం, శిక్షణ పొందిన వారికి ఉపాధి కల్పించేందుకు ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలకు వీలవుతుంది. అనుభవం, అర్హతల మేరకు పదవీ విరమణ చేసిన కేంద్ర సాయుధ పోలీసు దళం సభ్యులు తమకు నచ్చిన ప్రాంతంలో అర్హతలకు తగిన ఉపాధిని పొందేందుకు ఎలక్ట్రానిక్ వేదిక అవకాశం కలిగిస్తుంది. కేంద్ర హోంశాఖ తీసుకున్న ఈ నిర్ణయం కేంద్ర సాయుధ పోలీసు దళం సిబ్బంది సంక్షేమం, పునరావాస అవసరాలు తీర్చడంలో కీలకంగా ఉంటుంది.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

హైదరాబాద్,మే 9:సనత్‌నగర్ నియోజకవర్గంలోని కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో మంజూరైన చెక్కులను ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో లబ్ధిదారులకు అందించారు. 113 మంది లబ్ధిదారులు చెక్కులను అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ? ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమని అన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి, లక్ష్మీ హేమలత, మాజీ కార్పొరేటర్‌లు తరుణి, అరుణగౌడ్ శేషుకుమారి , ఆకుల రూప, తహసిల్దార్‌లు విష్ణుసాగర్, బాలశంకర్ పాల్గొన్నారు.

ప్రజా అవసరాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఆదివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో కుర్మబస్తీలో రూ.8.50 లక్షలతో ఏర్పాటు చేసిన జిమ్‌ను, అలాగే ఓల్డ్ గాస్‌మండీలో రూ. 50లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ చీర సుచిత్రతో కలిసి ప్రారంభించారు. అలాగే మంత్రి తన సొంత నిధులతో చేపడుతున్న ఓల్డ్ గాస్‌మండిలో ఉప్పలమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ జిమ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బస్తీ ప్రజల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను శుభకార్యాలకు ఉపయోగించుకోవచ్చునని సూచించారు.

కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో మొక్కలను నాటేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న ట్యాంక్‌కు మరో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని జలమండలి జీఎం రమణారెడ్డిని ఆదేశించారు. నియోజకవర్గం ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి పాటు పడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, బేగంపేట్ డీసీ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు దక్కడంలో జర్నలిస్టుల పాత్ర అభినందనీయం.. ఎమ్మెల్యే దాసరి

కరీంనగర్ , మే 9: దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ స్వశక్తి కరన్ అవార్డు దక్కడంలో జర్నలిస్టుల పాత్ర అభినందనీయని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ స్వశక్తి కరన్ పురస్కారం అవార్డు పొందిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, కార్యాలయ ఉద్యోగులను ఆయన ఘనంగా సన్మానించారు.

అవార్డు దక్కడంలో జర్నలిస్టుల పాత్రను గుర్తిస్తూ మండల జర్నలిస్టులను పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఎంపీపీ ప్రవంతి-శ్రీనివాస్, జడ్పిటిసి రాంమూర్తి, పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నారాయదాస్ అశోక్, ఉపాధ్యక్షుడు కుమ్మరి ముకేష్ కు శాలువాకప్పి సత్కరించారు. జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ సత్కారం పట్ల పెద్దపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన వైద్యం అందడమే సీఎం కెసిఆర్ లక్ష్యం: ఎమ్మెల్యే గండ్ర

హైదరాబాద్,మే 9:నాణ్యమైన వైద్యం అందడమే సీఎం కెసిఆర్ లక్ష్యం అని, అందుకు అనుగుణంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వంద పడకల హాస్పటల్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణాన్ని ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు చేతులమీదుగా ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. అలాగే, జిల్లాకు మెడికల్ కాలేజ్, ఆయుష్ హాస్పిటల్ కేటాయించడం పట్ల జిల్లా ప్రజల తరపున సీఎం కేసీఆర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీఎన్ రెడ్డికి నివాళులు అర్పించిన మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట, మే 9 : రైతాంగ సాయుధ పోరాటాల ద్వారానే తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు లభించిందని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. నిజాం నిరంకుశత్వంపై దివంగత భీంరెడ్డి నరసింహా రెడ్డి తిరుగుబాటు చేసి వెట్టి చాకిరి నుంచి ప్రజలకు విముక్తి కల్పించారన్నారు. రైతాంగ సాయుధ పోరాట నిర్మాత ,మార్క్సిస్టు నేత

భీంరెడ్డి నరసింహా రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి మంత్రి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశత్వంపై మొట్టమొదటి సారిగా తిరుగుబావుటా ఎగురవేసిన నేతగా బీఎన్ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. అటువంటి చరిత్రను దిశ దశలు వ్యాపింప చేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. దోపిడీ పాలన అంతానికి అగ్గి రాజేసిన మహా యోధుడిగా ఆయన కీర్తించబడుతున్నారని తెలిపారు.

తనకు జన్మనిచ్చిన ప్రాంతంలో గోదావరి నది జలాలతో సస్యశ్యామలం కావాలని బీఎన్ రెడ్డి పరితపించే వారన్నారు. ఆ తపనను ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి సాకారం చేశారన్నారు. బీఎన్ రెడ్డి పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు.

కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వైవీ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ సమస్యల దరకస్తులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాజర్షి షా.

మంచిర్యాల జిల్లాలో విషాదం.. తమ్ముడి మరణవార్త విని ఆగిన అన్న గుండె

ఆదిలాబాద్, మే 9:తమ్ముడు చనిపోయాడన్న వార్త విని అన్న గుండె కూడా ఆగిపోయింది. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లా ధర్మపురిలో గాజుల భాస్కర్‌గౌడ్ గుండెపోటుతో చనిపోవడంతో మృతదేహాన్ని లక్షెట్టిపేట తీసుకొచ్చారు.

తమ్ముడి మృతదేహాన్ని చూసి అన్న శ్రీనివాస్ గౌడ్ కూడా కుప్పకూలిపోయాడు. వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లినప్పటికీ అప్పటికే చనిపోయాడని డాక్టర్లు తెలిపారు. ఒకేరోజు అన్నదమ్ములు కన్నుమూయడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

సుస్థిర భవిష్యత్తు సాధనకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలలో ముందడుగు

న్యూఢిల్లీ, మే 9:కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఏపిఎఫ్‌లు), జాతీయ భద్రతా గార్డు (ఎన్ఎస్ జి) ఆవరణలలో అందుబాటులో ఉన్న భవనాల పై కప్పులపై లభించే సౌరశక్తి ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సోలార్జ్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఇసిఐ) అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసింది.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి శ్రీ అజయ్ కుమార్ భల్లా, ఎమ్ఎన్ఆర్ఈ కార్యదర్శి శ్రీ ఇందు శేఖర్ చతుర్వేది హాజరయ్యారు.

అవగాహనా ఒప్పందంపై ఎంహెచ్ఎ సంయుక్త కార్యదర్శి శ్రీ రాకేష్ కుమార్ సింగ్, ఎస్ఇసిఐ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సుమన్ శర్మ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీమతి సుమన్ శర్మ మాట్లాడుతూ "భారత వాతావరణ లక్ష్యాల సాధన కోసం భారత ప్రభుత్వానికి సేవలు అందించే అవకాశం ఎస్ఇసిఐ లభించడం సంతోషంగా ఉంది.

దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా ఇంటికప్పుపై పానెళ్ళను అమర్చి రూఫ్‌టాప్ సోలార్ సెక్టార్‌ను విస్తరించడానికి ఎదురుచూస్తున్నాము " అని అన్నారు.

దేశ భద్రతా బలగాలకు గ్రీన్ పవర్ సరఫరా దిశగా ఈ ఎంఒయు ఒక ముందడుగుగా ఉంటుంది. సుస్థిర భవిష్యత్తు సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి సహకారం అందిస్తుంది. రెస్కో మోడల్ కింద ఇంటికప్పుపై సౌర విద్యుత్ పానెళ్ళ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ఎంహెచ్ఏకు

శ్రమ ఆయుధమైతే.. విజయం బానిసే..

హైదరాబాద్,మే 9:విద్యార్థులు శ్రమను ఆయుధంగా చేసుకుంటే విజయం బానిసవుతుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం అబిడ్స్‌లోని రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి బాలుర హాస్టల్ ఆడిటోరియంలో రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సబిత, రెడ్డి జన సం ఘం సలహాదారులు ప్రొ.కంచర్ల దశరథ్‌రెడ్డి, అధ్యక్షుడు వేమిరెడ్డి నర్సింహారెడ్డి, కార్యదర్శి పాండు రంగారెడ్డిలతో కలిసి విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశారు. అనంతరం, మంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా, దేశంలో ఎక్కడా లేని విధంగా అగ్రవర్ణాలలో పేదలు ఉన్నారని గుర్తించి, అన్ని వర్గాలతో పాటు రెడ్డి సామాజిక వర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించిన ఘనత రాష్ట్ర సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

నిజాంల హయాంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి నగరంలో విద్యను అభ్యసించే వారికి వసతిని కల్పించేందుకు గాను నగర కొత్వాల్ రాజా బహదూర్ వెంటకరామిరెడ్డి హాస్టల్‌ను స్థాపించగా అది నేడు ఎంతో మంది ఉన్నతంగా బతికేందుకు దోహద పడిందన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి పేరు మీద పోలీస్ అకాడమికి పేరు పెట్టడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. తన ఇంటర్మీడియట్ విద్యాభ్యాసాన్ని రెడ్డి బాలికల కళాశాలలో పూర్తి చేశానని, ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రెడ్డి హాస్టల్‌లో కార్యక్రమానికి మొట్ట మొదటిసారి వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. రెడ్డి హాస్టల్ విస్తరణ కోసం కోకాపేట్‌లో 15 ఎకరాల భూమిని, 13 కోట్ల నిధులను, బాలికల హాస్టల్ కోసం బుద్వేల్‌లో 12 వందల గజాల స్థలాన్ని కేటాయించడమంటే అగ్రవర్ణాలలో పేదల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి ఎనలేనిదన్నారు. విద్యార్థులు శ్రమను ఆయుధంగా చేసుకుంటే విజయం బానిసగా మారుతుందని అన్నారు.

రెడ్డి జన సంఘం సలహాదారులు ప్రొఫెసర్ కంచర్ల దశరథరెడ్డి, అధ్యక్షులు వేమిరెడ్డి నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ రెండేళ్ళ పాటు కరోనా వ్యాప్తి నేపథ్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వలేకపోయినందుకు బాధగా ఉందన్నారు. ఈ యేడాది 268 విద్యార్థులకు రూ.22 లక్షల 23వేల ఉపకార వేతనాలను అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జన సంఘం ఉపాధ్యక్షులు తీగల బాల్‌రెడ్డి, గౌరి వెంకటరామిరెడ్డి, ఏ.సుకన్యారెడ్డి, పి.స్వరూపారాణి, కార్యదర్శి బి.మధుసూదన్ రెడ్డి, కోశాధికారి వి.వీరారెడ్డి, రెడ్డి బాయ్స్ హాస్టల్ చైర్మన్, టామ్‌కామ్ మాజీ చైర్మన్ బోయపల్లి రంగారెడ్డి, సంఘం సభ్యులు తీగల మోహన్‌రెడ్డి, మర్రి ప్రభాకర్‌రెడ్డి, ఎం.భారతి, మర్రి వామన్ రెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి, ఎస్.జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లా సమీక్ష మండలి సమావేశం

అమరావతి, మే 9:శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్ష మండలి సమావేశం జరుగుతోంది. జిల్లా ఇంచార్జి మంత్రి బొత్స సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయి రాజ్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఎ పిఒ దివ్య పాల్గొన్నారు.

త్యాగం అంటే పవన్‌ను సీఎం చేస్తారా?: చంద్రబాబుపై సజ్జల ఫైర్

అమరావతి, మే 9:ఏపీలో వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీల పొత్తులపై ఏపీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సోమవారం నాడు స్పందించారు. ఈ సందర్భంగా తాను త్యాగం చేసేంకుకు సిద్ధమంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై కీలక వ్యాఖ్యలుచేశారు. చంద్రబాబే త్యాగం అంటే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేస్తారా? అని సజ్జల ప్రశ్నించారు. ఒకరు త్యాగాలకు సిద్ధమంటారు.. మరొకరు తానే సీఎం అంటున్నారు..ఇంకొకరేమో తాము కలవమంటారని ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేనకు రాజకీయ అవసరాలే తప్ప ప్రజాప్రయోజనాలు వాళ్లకు అవసరం లేదని మండిపడ్డారు. చంద్రబాబు చేసిన జంప్‌లు అందరికీ తెలుసన్నారు. ప్రజలంటే చంద్రబాబుకు చులకన ఎందుకని ప్రశ్నించారు. చంద్రబాబు డైరెక్షన్ లోనే పవన్ కల్యాణ్ నడుస్తున్నారని ఆరోపించారు. పవన్ డైలాగులన్నీ చంద్రబాబు చెబుతున్నవేనని సజ్జల ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ ఇప్పటికీ పొత్తులోనే ఉన్నారన్న సజ్జల.. ప్రజాప్రభుత్వాన్ని గద్దె దించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. విపక్షాలు పగటి కలలు కంటున్నాయని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన స్పీకర్

కామారెడ్డి,మే 9: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం హసన్ పల్లి గేటు వద్ద నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మరణించిన సంగతి తెలిసిందే. పిట్లం మండలం చిల్లెర్గి గ్రామానికి చెందిన తొమ్మిది మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, కామారెడ్డి జిల్లా కలెక్టర్ చిల్లెర్గి గ్రామానికి చేరుకొని మృతులకు నివాళులర్పించారు. ఆయా కుటుంబాలను పరామర్శించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

కాగా, ఆదివారం సాయంత్రం నిజాంసాగర్ మండలం హసన్‌పల్లి వద్ద జరిగిన లారీ-ఆటో ఢీకొని జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 9 మంది మృతి చెంది మరో 14 మంది గాయపడ్డారు. మృతుల్లో ఆరుగురు పిట్లం మండలం చిల్లర్గి వాసులు, పెద్దకొడపగల్ మండలం తుగ్దల్, కాటేపల్లి, బాన్సువాడ పట్టణానికి సంబంధించిన వారు ఒక్కొక్కరు ఉన్నారు. బాన్సువాడ ఏరియా హస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మెరుగైన చికిత్స అందించాలని ఇప్పటికే అధికారులను, వైద్యులను స్పీకర్ పోచారం ఆదేశించారు.

కాగా, రోడ్డు ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటిస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రకటించారు.

టెలీ కన్సల్టేషన్‌తోనే ఆరోగ్యరంగ భవితవ్యం!

న్యూఢిల్లీ, మే 9:గుజరాత్ లోని కెవాడియాలో 2022 మే 5నుంచి 7వ తేదీవరకూ మూడు రోజులపాటు జరిగిన 'స్వాస్థ్య చింతన్ శిబిరం' ముగింపు కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్.సుఖ్ మాండవీయ ప్రసంగించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కేంద్రీయ మండలి (సి.సి.హెచ్.ఎఫ్.డబ్ల్యు) 14వ సమ్మేళనం సందర్భంగా ఈ శిబిరం నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయమంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్, నీతీ ఆయోగ్ ఆరోగ్య విభాగం సభ్యుడు డాక్టర్ వి.కె. పాల్, వివిధ రాష్ట్రాల ఆరోగ్య మంత్రులు, ఆరోగ్య శాఖల కార్యదర్శులు, ఆరోగ్య శాఖ ప్రతినిధులు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ, నీతీ ఆయోగ్, భారతీయ వైద్య పరిశోధనా మండలి ప్రతినిధులు, శాస్త్రవేత్తలు ఈ శిబిరంలో పాల్గొన్నారు.

కేంద్రమంత్రి డాక్టర్ మాండవీయ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, మూడు రోజులపాటు జరిగిన స్వాస్థ్య చింతన్ శిబిరంలో దాదాపు 25మంది ఆరోగ్య, వైద్యవిద్యా శాఖ మంత్రులు పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఏదైనా లక్ష్యాన్ని పరిపూర్ణంగా సాధించడమే (సిద్ధిని పొందడమే) సంకల్పానికి ఛోదకశక్తిగా పనిచేయగలదని అన్నారు. , "రాష్ట్రాలన్నీ అత్యుత్తమమైన విధానాలను చేపట్టడం వల్లనే ఆరోగ్య రంగంపై మేం కూలంకష పరిజ్ఞానాన్ని సముపార్జించగలిగాం. ఆరోగ్య రంగంలో ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయడానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఇది దోహదపడింది." అని ఆయన అన్నారు. "అన్ని రాష్ట్రాలు తమతమ ఉత్తమ విధానాలను ఈ సమ్మేళనంలో పంచుకున్నాయి. దీనితో ఇపుడు మా వద్ద 25కుపైగా ఉత్తమ విధానాలు దేశవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. కేంద్రం లక్ష్యాలు, రాష్ట్రాల లక్ష్యాలు పరిపూర్ణత్వానికి ఎంతో అవసరం. కేంద్ర స్థాయిలో విధాన రూపకల్పనకు దోహదపడేది రాష్ట్రాల లక్ష్యాలే." అని కేంద్రమంత్రి అన్నారు.

రాష్ట్రాలు సహకార సమాఖ్య స్ఫూర్తితో పనిచేయాల్సిన ఆవశ్యకతను గురించి డాక్టర్ మాండవీయ ఈ సందర్భంగా వివరించారు. "రాష్ట్ర లక్ష్యాలే మాకు జాతీయ స్థాయి లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయి. వివిధ రకాల విధానాలకు సంబంధించి రాష్ట్రాలే మాకు రోడ్ మ్యాప్.ను, కార్యాచరణ ప్రణాళికను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో ?ఆరోగ్యవంతమైన కుటుంబం-రూపొందించేందుకు స్వాస్థ్య శిబిరం ఒక పునాదిగా దోహదపడింది. అంత్యోదయ పథక లక్ష్యం పూర్తి చేసేందుకు మన పౌరుల సంక్షేమం లక్ష్యంగా ఆరోగ్య విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని మనమంతా ప్రతిన బూనుదాం. చివరి పౌరుడికి ఆరోగ్య సేవల బట్వాడా ద్వారా పూర్తి ప్రయోజనం కలగించడమే మన ప్రధాన లక్ష్యం కావాలి." అని కేంద్రమంత్రి అన్నారు.

"ఆరోగ్యం అంటే మాకు వాణిజ్యం కాదు. సేవ మాత్రమే. వైద్య పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి మేం చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నాం. -భారతదేశం ద్వారా ఆరోగ్యాన్ని అందించడం, భారతదేశంలో ఆరోగ్యాన్ని అందించడం-రాబోయే రోజుల్లో మన ఆరోగ్య వ్యవస్థకు ఇవే మూల స్తంభాలు కానున్నాయి. దీనితో భారతదేశం ప్రపంచం యావత్తుకూ ఆరోగ్య సారథిగా నిలిచే అవకాశాలు ఉన్నాయి." అని కేంద్రమంత్రి అన్నారు.

'క్షయరోగి/గ్రామం దత్తత' పేరిట త్వరలో ప్రారంభం కానున్న పథకంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని డాక్టర్ మాండవీయ పిలుపునిచ్చారు. ఈ పథకం కింద ప్రతి ఒక్కరూ క్షయరోగి సంక్షేమం లక్ష్యంగా వారిని దత్తత తీసుకుని, సకాలంలో వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స అందేలా చూస్తారు. 2025 సంవత్సరానికల్లా దేశాన్ని క్షయరహితంగా చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు.

కంటికి సంబంధించి కాటరాక్ట్ శస్త్ర చికిత్స లక్ష్యాలన్నింటినీ పూర్తి చేయాలన్న జాతీయ పథకం అమలుకోసం తగిన సహకారం అందించవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ విషయమై ఈ-సంజీవని పథకం ద్వారా టెలికన్సల్టేషన్ ప్రక్రియకు మరింత ప్రజాదరణ కల్పించేందుకు రాష్ట్రాల మంత్రులు కృషి చేయాలని ఆయన సూచించారు. "మంత్రులంతా వారి వారి జిల్లాల్లోని ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించిన హెల్త్ వెల్ నెస్ కేంద్రాలను (హెచ్.డబ్ల్యు.సి.లను) సందర్శించాలని, పథకం అమలు తీరును స్వయంగా పరిశీలించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. కోవిడ్ వైరస్ వ్యాప్తి సంక్షోభ సమయంలో ఈ పథకం ద్వారానే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందాయి. మన ఆరోగ్య వ్యవస్థ భవితవ్యం టెలీ కన్సల్టేషన్ ప్రక్రియపైనే ఆధారపడింది. చివరి లబ్ధిదారుకు కూడా సిసలైన ఆరోగ్య సేవలందించేందుకు టెలికన్సల్టేషన్ పరిపూర్ణ వేదికను అందిస్తుంది కాబట్టి, ఈ ప్రక్రియను భారీ స్థాయిలో అమలు చేసేందుకు మనం కృషి చేయాల్సి ఉంది" అని కేంద్రమంత్రి అన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాకు ప్రజాదరణ కల్పించేందుకు ఆయా రాష్ట్రాల మంత్రులు కృషి చేయాలని కేంద్రమంత్రి డాక్టర్ మాండవీయ విజ్ఞప్తి చేశారు. "ఆరోగ్య రంగంలో భారతదేశాన్ని డిజిటల్ విప్లవం వైపు నడిపించేందుకు ఆయుష్మాన్ భారత్ జాతీయ డిజిటల్ ఆరోగ్య పథకం ప్రముఖంగా పనిచేస్తుంది. ఆయుష్మాన్ భారత్ పథకం గుర్తింపు సంఖ్యను ఏర్పాటు చేసేందుకు మనమంతా యుద్ధప్రాతిపదికన పనిచేయాల్సి ఉంది. సేవల బట్వాడాకు, గోప్యతకు ఈ పథకం పూచీగా నిలుస్తుంది." అని ఆయన అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల బట్వాడాకు సంబంధించి లబ్ధిదారుల, రోగుల అభిప్రాయం తెలుసుకోవడం కోసం కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'మేరా అస్పతాల్ (నా ఆసుపత్రి)' పేరిట ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్ గురించి డాక్టర్ మాండవీయ తెలియజేశారు. "మనం జీవన శైలి, ఆహారపు అలవాట్లపై కూడా ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించాల్సి ఉంది.," అని అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ రంగాలవారీగా లక్ష్యాలను కూడా ఈ సమ్మేళనం నిర్దేశించినట్టు డాక్టర్ మాండవీయ చెప్పారు. క్షయ రహిత భారతదేశం, కాటరాక్ట్ శస్త్రచికిత్సల లక్ష్యాన్ని పూర్తి చేయడం వంటి అంశాలతో పాటు వివిధ రంగాలకు సంబంధించి పలు లక్ష్యాలను ఈ స్వాస్థ్య చింతన్ శిబిరం నిర్దేశించిందని అన్నారు. "ఆరోగ్య రంగంలో నిర్దేశించుకున్న ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రజలకు కూడా భాగస్వామ్యాన్ని కల్పించవలసిన అవసరం ఉంది." అని ఆయన అన్నారు. జూన్ నెల 1వ తేదీనుంచి కాటరాక్ట్ శస్త్రచికిత్సలను చేపట్టేందుకు అంకిత భావంతో కూడిన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు కేంద్రమంత్రి చెప్పారు.

ఆరోగ్యశాఖల సిబ్బంది కలసికట్టుగా బృంద స్ఫూర్తితో పనిచేసినందునే స్వాస్థ్య చింతన్ శిబిరం విజయవంతమైందని పేర్కొంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. కెవాడియాలో మూడు రోజులపాటు జరిగిన స్వాస్థ్య చింతన్ శిబిరంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ఆరోగ్య మంత్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా సైకిల్ తొక్కడం, పర్వతారోహణ, యోగా వంటి కార్యకలాపాల్లో భాగస్వామ్యం వహించిన వారందరికీ నాయకత్వం వహిస్తూ డాక్టర్ మాండవీయ తగిన ప్రోత్సాహాన్ని అందించారు. కేంద్రీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మండలి (సి.సి.హెచ్.ఎఫ్.డబ్ల్యు) ఆధ్వర్యంలో రూపొందించిన వెబ్ సైట్.ను కూడా కేంద్రమంత్రి ఆవిష్కరించారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయమంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ ఈ సమ్మేళనంలో మాట్లాడుతూ. ఆరోగ్య రంగానికి సంబంధించిన అనేక అంశాలపై, నాణ్యమైన వైద్య సేవల బట్వాడాపై సమైక్యంగా మేధోమథనం జరిపేందుకు స్వాస్థ్య చింతన్ శిబరం తగిన వేదికను అందించిందని ఆయన అన్నారు. కోవిడ్-19 వైరస్ మహమ్మారి వ్యాప్తితో తలెత్తిన సంక్షోభాన్ని ఎదుర్కొనడంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదర్శించిన సహకార దృక్పథం అభినందనీయమని ఆమె అన్నారు. కోవిడ్ నిరోధం లక్ష్యంగా దేశంలో 190కోట్ల టీకా డోసులను అందించడంలో రాష్ట్రాల కృషి ప్రశంసనీయమని అన్నారు. ''ఆరోగ్యరంగంలో భారతదేశాన్ని -విశ్వగురువు-గా తీర్చిదిద్దేందుకు మేం కట్టుబడి ఉన్నాం" ఆమె ప్రకటించారు.

నీతీ ఆయోగ్ ఆరోగ్య విభాగం సభ్యుడు డాక్టర్ వి.కె. పాల్ మాట్లాడుతూ, భారతదేశం భావి ఆరోగ్య వ్యవస్థ బ్లూప్రింటును రూపొందించేందుకు ఈ చింతన్ శిబిరం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. చింతన్ శిబిరం నిర్వహణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బృందాలు చేసిన కృషి అభినందనీయమని అన్నారు.

స్వాస్థ్య చింతన్ శిబిరం మూడవ రోజున ఆరోగ్య రంగంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే విధానాలు, భారతదేశపు ఆరోగ్య ప్రజా ప్రతిస్పందన, కోవిడ్ వ్యాప్తిపై అధ్యయనం, భవిష్యత్తు ఆరోగ్య అత్యయిక పరిస్థితులను ఎదుర్కొనేలా భారతదేశాన్ని తీర్చిదిద్దడం, ఆరోగ్యవంతమైన భారతదేశం లక్ష్యంగా రోడ్ మ్యాప్ తదితర అంశాలు, ఇతివృత్తాలపై సదస్సులను నిర్వహించారు. ప్రతి రాష్ట్రం ఎదుర్కొన్న అనుభవాలనుంచి, వివిధ రాష్ట్రాల ఆరోగ్యకార్యకలాపాల నిర్వహణనుంచి విషయాలను అధ్యయనం చేయడానికి ఈ సదస్సులో తగిన అవకాశం కల్పించారు. వివిధ రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు, ఆరోగ్య శాఖల ప్రతినిధులు తమతమ అనుభవాలను ఈ సమ్మేళనంలో పంచుకున్నారు.

దీనికి తోడుగా, ఆరోగ్య రంగం, సంక్షేమంపై వివిధ అంశాలను గురించిన చర్చను కూడా చేపట్టారు. అందరికీ అందుబాటులో, అందుబాటు ధరల్లో, సమాన ప్రాతిపదికతో ఆరోగ్యం కల్పించాలన్న లక్ష్యానికి తాము కట్టుబడి ఉన్నట్టు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమ్మేళనంలో పునరుద్ఘాటించాయి. మూడు రోజులపాటు సమర్థవంతంగా స్వాస్థ్య చింతన్ శిబిరం నిర్వహించిన తీరుపై వివిధ రాష్ట్రాల ఆరోగ్య మంత్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు కేంద్ర ఆరోగ్యమంత్రికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.

దేశంలో ఆరోగ్య వ్యవస్థ భవితవ్యానికి సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించేందుకు 3రోజుల ఈ చింతన్ శిబిరం తగిన వేదికను కల్పించింది. ఆరోగ్యరంగంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సమీక్షించుకునేందుకు కూడా ఈ శిబిరం దోహదపడింది.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం..!!

మెదక్, మే 9 (నేటి నిజం ప్రతినిధి) ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం చేపట్టబడిందని, అధికారులు ఇట్టి ప్రాధాన్యతను గుర్తించి తక్షణమే సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని అదనపు కలెక్టర్ రమేష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి 32 వినతులు వచ్చాయి. అందులో ప్రధానంగా భూ సమస్యలకు సంబంధించి 20 విజ్ఞప్తులు రాగా, సదరం సర్టిఫికెట్, మూడు చక్రాల బ్యాటరీ సైకిల్, కృత్రిమ కాలు కావాలని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తదితర 12 విజ్ఞప్తులు వచ్చాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేష్ మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించి ఆయా మండల తహసీల్దార్లకు విజ్ఞప్తులు అందించాలని, అక్కడ పరిష్కారం కాని పక్షంలో ఇక్కడకు రావాలని, అనవసరంగా వ్యయ ప్రయాసా లకు గురికావద్దని ఫిర్యాదీదారులకు విజ్ఞప్తి చేశారు. అధికారులు కూడా తమ పరిధిలోనే పరిష్కరింపదగ్గ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కాని పక్షంలో అట్టి సమస్య పరిష్కారానికి మార్గం చూయించాలని అన్నారు. ఈ సందర్భంగా వచ్చిన విజ్ఞప్తులను ధరణి, జిల్లా పంచాయతీ అధికారి, డి.ఆర్.డి.ఓ. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, మునిసిపల్ కమిషనర్ అధికారులకు తగు చర్య నిమిత్తం పంపారు .ప్రజా వాణిలో వచ్చిన కొన్ని సమస్యలు ఇలా..

అల్లాదుర్గ్ మండలం గాండ్ల బావి తండా లోని సర్వే నెంబర్ 436/10/4 లో గల 1. 24 గుంటల భూమిని 1954 నుండి సాగు చేస్తుండగా ధరణిలో 425/ఉ గా చూపిస్తున్నదని అది మా తల్లి గారి పేర చూయిస్తున్నందున మా భూమే అని ఏం.పి .పి అధ్యక్షులు ఈర్ల అనిల్ కుమార్ రెడ్డి గిరిజనులమైన మా పై దౌర్జన్యం చేస్తున్నారని న్యాయం చేయవలసినదిగా రాత్ల సుమన్ నాయక్ ఫిర్యాదు చేయగా తగు సర్వే చేయవలసినదిగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏ.డి. కి సూచించారు.

ఘనపూర్ మండలం లింగసానిపల్లి కి చెందిన తారీ తన భర్త చనిపోయాడని పింఛను ఇప్పించవలసిందిగా కోరారు.

శంకరంపేట్ మండలం ఖాజాపూర్ కు చెందిన కర్రె ప్రసాద్ తాను ఈ.యెన్.టి. వంద శాతం వికలాంగుడనని పింఛనుకై సదరం సర్టిఫికెట్ ఇప్పించవలసిందిగా కోరారు.

హవేళిఘనాపూర్ మండల్ ఔరంగా బాద్ తండా కు చెందిన భాబ్య తాను ఇంటర్ వరకు చదివానని పేదరికంలో ఉన్న తనకు ఉద్యోగం ఇప్పించవలసిందిగా కోరారు.

కూచన్ పల్లి లోని 9వ వార్డులో రోడ్డు కోసం వదిలిన స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం గావిస్తున్న ఖురేషి జుబేర్,ఖురేషి తాసిమ్ ల పై చర్య తీసుకోవలసిందిగా ఆ వార్డు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

మెదక్ పట్టణంలో నిర్వహించుకుంటున్న మిర్చి షావు నుండి ఇబ్బందులేదు రావుతున్నాయని, షాపును తొలగించవలసినదిగా సూర్య సౌండ్ వారు మమ్మల్ని తిడుతున్నారని, మాకు ఈ షాపు ఒక్కటే ఆధారమున్నందున సహకరించవలసినదిగా ఆశమ్మ అభ్యర్థించగా తగు చర్య తీసుకోవలసినదిగా మునిసిపల్ కమిషనర్ కు సూచించారు.

మెదక్ పట్టణంలోని దయారా వీధి వార్డు నెంబర్ 25 లో ప్రభుత్వం కట్టించిన ఇళ్లలో ఉంటున్న మా స్థలాలను పంపరి శివాజీ ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆ వార్డుకు చెందిన బడుగు వర్గాల వారు విజ్ఞప్తి చేయగా పరిశీలించి తగు న్యాయం చేయవలసినదిగా మునిసిపల్ కమిషనర్ కు సూచించారు. తాగుడుకు బానిసైన నా భర్తకు పిల్లలతో పాటు దూరంగా ఉంటున్న నాకు తెలియకుండా నా భర్త 1 .26 ఎకరాల భూమిని అమ్ముకుంటున్నారని, తనకు న్యాయం చేయవలసినదిగా టేక్మాల్ మండలం బర్దీపూర్ కు చెందిన తులసమ్మ వేడుకొన్నారు.

తూప్రాన్ మండలంలోని దాతార్ పల్లి లో సర్వే నెంబర్ 64/జీజీ మరియు 65,66 లో గౌడ సంఘానికి చెందిన భూమిని కొందరు అక్రమంగా అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని, అట్టి భూమిని కాపాడవలసినదిగా సంఘం సభ్యులు కోరగా తూప్రాన్ తహశీల్దార్ కు తగు చర్య తీసుకోవలసిందిగా అదనపు కలెక్టర్ రమేశ్ సూచించారు.

చేగుంట మండలం వల్లభాపుర్ గ్రామం మల్లికార్జున స్వామి దేవాలయానికి సంబంధించిన భూమి సర్వే నెంబర్ 209/1ఆ, 209/1ఇ , 209/1ఆ ను బత్తుల లింగయ్య ఆక్రమించుకున్నారని, సర్వే చేసి భూమిని కాపాడవలసినదిగా యాదవ సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు.

సర్వే నెంబరు 592/ఈ లో ఉన్న పదిన్నర గుంటల భూమి వేరే పేరున చూయిస్తున్నధని , మాపై మార్చివలసినదిగా రామాయంపేట కు చెందిన గగులోత్ స్వరూప కోరగా, నా భూమి పై ఇంతవరకు పట్టా పాస్ బుక్ రాలేదని ఇప్పించవ లసినదిగా కొడిపల్లి మండలం రాజిపేట్ కు చెందిన గాండ్ల దుర్గయ్య విజ్ఞప్తి చేశారు.

తన అనుమతి లేకుండా మరొకరి పేర భూమి రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చర్య తీసుకొని నా భూమి ఇప్పించవలసిందిగా తూప్రాన్ మండలం నాగులపల్లి కి చెందిన మహంకాళి మైసమ్మ కోరగా నా భూమిని పట్టాదార్ పాస్ బుక్ లో నమోదు చేయవలసినదిగా రేగోడ్ మండలం మర్వ ల్లికి చెందిన పన్యాల పాపయ్య కోరారు. వారసత్వంగా రావలసిన 14 గుంటల భూమి బబ్బూరి వెంకటేశం కబ్జా చేశారని, సర్వే చేసి హద్దులు చూపించవలసినదిగా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన కమ్మరి పండరయ్య విజనపతి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషద్ సీఈఓ శైలేష్, డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు గంగయ్య, నీటిపారుదల శాఖా ఈఈ శ్రీ నివాసరావు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ కృష్ణ మూర్తి, కలెక్టరేట్ ఏ.ఓ. మన్నన్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తల్లి ప్రేమ వెలకట్టలేనిది : మంత్రి తలసాని



హైదరాబాద్,మే 9: సృష్టికి జీవం పోసిన రెండు అక్షరాల దేవత అమ్మ అని, అలాంటి మాతృమూర్తిని ప్రతి ఒక్కరు తప్పకుండా నిరంతరం గౌరవించుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు

పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోపు అన్ని రకాల పనులు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

రాజన్న సిరిసిల్ల, మే 9:(నేటినిజం ప్రతినిధి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమంలో గుర్తించిన పనులు, మరమ్మత్తులను పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

సోమవారం ఆయన మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, మన బస్తీ - మన బడి కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలను క్షేత్ర స్థాయిలో సందర్శించారు.

విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం కింద మొత్తం 172 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని, ప్రణాళికాబద్ధంగా ఈ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు చేపడుతున్నామని అన్నారు.

పాఠశాలల్లో కాంపౌండ్ వాల్, టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ ల నిర్మాణం, ఇతర మరమ్మత్తులు, త్రాగునీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయం, తదితర పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. త్వరలోనే అన్నీ గ్రౌండింగ్ చేసుకుని పనులు ప్రారంభిస్తామని అన్నారు.

ఈ సందర్శనలో ఆయన వెంట డీఈవో రాధాకిషన్, ఎంపీడీఓ నరేష్ ఆనంద్, ఏఈ నరసింహా ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని , తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష - జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్

సంగారెడ్డి, మే 9(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో సోమవారం నాడు జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ సోమవారం నాడోక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 17,769 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 16,724 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 94.12 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. 1045 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు వెల్లడించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి 4 పరీక్షా కేంద్రాలను, డి ఈ సి మెంబర్లు 4, హెచ్ పి సి మెంబర్లు 5, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 10, సిట్టింగ్ స్క్వాడ్స్ 4 పరీక్ష కేంద్రాలను సందర్శించి పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

స్వర్గీయ చెన్నమనేని రాజేశ్వర్ రావుకు టీఆరెస్ నాయకుల నివాళి

రాజన్న సిరిసిల్ల, మే 9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో సోమవారం స్వర్గీయ చెన్నమనేని రాజేశ్వర రావు6వ వర్ధంతిని టీఆరెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ చెన్నమనేని రాజేశ్వర రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చెన్నమనేని రాజేశ్వర రావు కష్టజీవుల కోసం కమ్యూనిస్టుగా, భూమి కోసం భుక్తి కోసం రావి నారాయన రెడ్డితో రైతాంగ సాయుధపోరాటంలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. తన అర్ధాంగి లలితా దేవితో ఐదు సంవత్సరాలు అగ్నాతంలో, మూడు దశాబ్దాలు శాసనసభలో ప్రజావాణిగా గోదావరి జలాల ఎత్తిపోతల కోసం, స్వరాష్ట్రం కోసం గట్టి అండనిచ్చిన, మచ్చ లేని చరిత్రగలిగిన మహనీయుడు అన్నారు.

దివంగత నేత, వామపక్ష దిగ్గజం సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలకి 30 సంవత్సరాలు ప్రాతినిధ్యం వహించి వేలాది రైతులకు కౌలుదారి చట్టం ద్వారా, భూసంస్కరణల ద్వారా వారి హక్కులకు భరోసానిచ్చారన్నారు. సిరిసిల్లలో రాయిని చెరువులో 600 ఎకరాలు (ప్రస్తుత బద్దం ఎల్లరెడ్డి నగర్) పదివేల మంది నేత కార్మికులకు కొట్లాడి ఇండ్ల పట్టాలిప్పిచ్చారన్నారు.

1964 నుంచి 1971 కాలం లో అమెరికా ఫోర్డు ఫౌండేషన్ ను ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డిని ఒప్పించి భారత దేశంలోనే 100 శాతం సిరిసిల్ల పాత తాలూకాలో అన్ని గ్రామాలకు సెస్సు ద్వారా కరెంటు తెచ్చి వ్యవసాయానికి, పవర్లూం మగ్గాలకు ఊపిరి పోసిన మహనీయుడని గుర్తుచేశారు. సన్న, చిన్న కారు రైతన్నల వ్యవసాయానికి శాశ్వత పరిష్కారం ఎత్తి పోతలే అని 1957 లోనే శాసనసభలో తేల్చి చెప్పిన చెన్నమనేని రాజేశ్వర రావు కలలు నేడు సాకారమవుతున్నాయన్నారు. శాసన సభ్యులు రమేష్ బాబు నాయకత్వంలో వేములవాడ నియోజకవర్గంలో 55 000 ఎకరాలకు సాగు నీరు సౌలభ్యమయ్యిందని అన్నారు. సేవ్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సిరిసిల్ల, వేములవాడలో చెన్నమనేని రాజేశ్వర రావు, చెన్నమనేని రమేష్ ల నాయకత్వంలో 200 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. త్రాగు నీటి కోసం 132 ట్యాంకులు, లక్షలాది కిలోమీటర్ల పైపు లైన్లు, వెయ్యి బోర్లు, ఐదు జూనియర్ కలాశాలలతో పాటు 308 పాటశాల భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు,సెస్ డైరెక్టర్ పోలాస నరేందర్,కౌన్సిలర్లు సరాల శేఖర్,సిరిగిరి చందు,ఇప్పపూల అజయ్,సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి కోఅప్షన్ సభ్యులు బాబున్,మార్కెట్ కమిటీ సభ్యులు ఫీర్ మహ్మద్,కమాలకర్ రెడ్డి,నామకులు రామాతీర్థపు రాజు,గూడురి మధు,కుమ్మరి శ్రీనివాస్,కందుల క్రాంతి,నీలం శేఖర్,ప్రసాద్ రావు,కోండ నర్సమ్య,రాజేశం,సదానందం,రవి,టైలర్ శ్రీనివాస్,యువజన నాయకులు రాము,మహేందర్,ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక భద్రత కల్పనలో 7 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై).. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై).. అటల్ పెన్షన్ యోజన (ఏపీవై)

న్యూఢిల్లీ, మే 9:నేడు మనం మూడు సామాజిక భద్రత (జన సురక్ష) పథకాల 7వ వార్షికోత్సవం నిర్వహించుకుంటున్నాం. ఈ మేరకు "ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకాల స్వరూపాన్ని, అవి సాధించిన విజయాలను ఒకసారి పరిశీలిద్దాం. ఈ మూడు పథకాలూ ప్రజలకు సరసమైన బీమా ద్వారా భద్రతను అందించాయి.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ "పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై"లను పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో 2015 మే 9వ తేదీన ప్రారంభించారు.

అనూహ్య ముప్పులు/నష్టాలు, ఆర్థిక అనిశ్చితి నుంచి మానవ జీవితానికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత మేరకు ఈ మూడు సామాజిక భద్రత పథకాలు పౌరుల సంక్షేమానికి అంకితం చేయబడ్డాయి. దేశంలోని అసంఘటిత వర్గ ప్రజా జీవనాన్ని ఆర్థికంగా సురక్షితం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రెండు బీమా పథకాలు? ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై)లతోపాటు వృద్ధాప్య అత్యవసర పరిస్థితులలో ఆదుకునేలా అటల్ పెన్షన్ యోజన (ఏపీవై)ని కూడా ప్రవేశపెట్టింది.

ఈ పథకాల్లో 'పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై'ల ద్వారా ప్రజలకు తక్కువ ఖర్చుతో జీవిత/ప్రమాద బీమా రక్షణ లభిస్తుంది. అదేవిధంగా ప్రస్తుత పొదుపు ద్వారా వృద్ధాప్యంలో క్రమబద్ధంగా పెన్షన్ పొందే అవకాశాన్ని 'ఏపీవై' కల్పిస్తుంది.

పథకం 7వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, కేంద్ర ఆర్థిక ఉ కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి. నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, "ఆగస్టు 15, 2014న గౌరవ ప్రధానమంత్రి ప్రకటించిన నేషనల్ మిషన్ ఫర్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కింద ప్రధాన లక్ష్యాలలో ఒకటి పేద, అట్టడుగు వర్గాలకు అందించడానికి బీమా మరియు పెన్షన్ కవరేజీని విస్తరించడం. సరసమైన ఉత్పత్తుల ద్వారా సమాజానికి చాలా అవసరమైన ఆర్థిక భద్రత." అని తెలిపారు.

"మూడు జన్ సురక్ష పథకాలు బీమా, పెన్షన్లను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చాయి. గత ఏడేళ్లుగా పై పథకాలలో నమోదు చేసుకున్న, లబ్ధి పొందిన వారి సంఖ్య వారి విజయానికి నిదర్శనం. ఈ తక్కువ -ధర బీమా పథకాలు గ్యారెంటీ పెన్షన్ పథకం గతంలో ఎంపిక చేసిన కొంతమందికి అందుబాటులో ఉన్న ఆర్థిక భద్రత ఇప్పుడు సమాజంలోని చివరి వ్యక్తికి చేరేలా చేస్తున్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

ఆర్థిక మంత్రి పేదలకు సౌకర్యాలు కల్పించడంపై వివరిస్తూ, "నేడు, అత్యంత పేదవారు కూడా పీఎంజేజేబీవై కింద రోజుకు 1 రూపాయి కంటే తక్కువతో, రూ. 2 లక్షల జీవిత బీమా పొందవచ్చు. రూ. 2 లక్షల ప్రమాద బీమాను పీఎంఎస్‌బీవై కింద నెలకు 1 రూపాయి కంటే తక్కువతో పొందవచ్చు. దేశంలోని 18 నుండి 40 ఏళ్ల మధ్య ఉన్న పౌరులందరూ 60 ఏళ్ల తర్వాత నెలకు కనీసం రూ. 42 చెల్లించి పెన్షన్ పొందేందుకు అర్హులే.

పీఎంజేజేబీవై ద్వారా పౌరులకు సౌకర్యంతో కూడిన భద్రతను అందించడం, ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి సమయంలో, పీఎంజేజేబీవై కింద, లైఫ్ కవర్ కోసం ప్రారంభం నుండి 12.76 కోట్ల మంది వ్యక్తులు నమోదు చేసుకున్నారు. 5,76,121 మంది వ్యక్తుల కుటుంబాలు పథకం కింద రూ. 11,522 కోట్లు క్లెయిమ్ పొందారు. 2021 ఆర్థిక సంవత్సరం నాటికి కోవిడ్ సమయంలో తక్కువ-ఆదాయ కుటుంబాలకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా మారింది. దాదాపు 50% క్లెయిమ్‌లు కోవిడ్ మరణాల కారణంగా చెల్లించబడ్డాయి. మహమ్మారి కాలంలో క్లెయిమ్‌లను త్వరగా మరియు సులభంగా పరిష్కరించేందుకు క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియలో ప్రధాన మార్పులు తీసుకురాబడ్డాయి. క్లెయిమ్‌ల సులభ పరిష్కారం కోసం తీసుకొచ్చిన ఈ మార్పులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. కోవిడ్ ప్రారంభమైనప్పటి నుండి, అంటే ఏప్రిల్ 1, 2020 నుండి, ఫిబ్రవరి 23, 2022 వరకు, మొత్తం 2.10 లక్షల క్లెయిమ్‌లు రూ. 4,194.28 కోట్లు, 99.72% సెటిల్‌మెంట్ రేటుతో చెల్లించబడ్డాయి.

పీఎంఎస్‌బీవై ప్రారంభించినప్పటి నుండి 28.37 కోట్ల మంది ప్రజలు ప్రమాద రక్షణ కోసం నమోదు చేసుకున్నారు. 97,227 క్లెయిమ్‌ల కోసం 1,930 కోట్ల రూపాయలు చెల్లించారు. ఇప్పటికే 4 కోట్ల మందికి పైగా ప్రజలు ఏపీవై పథకంలో చేరారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కిషన్‌రావ్ కరద్ మాట్లాడుతూ, "ఈ పథకాల 7వ వార్షికోత్సవం సందర్భంగా, వీటిని విజయవంతంగా అమలు చేసిన అన్ని బ్యాంకులు మరియు బీమా కంపెనీలను నేను అభినందిస్తున్నాను మరియు వాటిని కొనసాగించవలసిందిగా అభ్యర్థిస్తున్నాను. చివరి వ్యక్తికి కవర్ అయ్యే వరకు అదే ఉత్సాహం మరియు అంకితభావంతో పనిచేయాలి."

"దేశంలోని ప్రతి ఒక్కరూ బీమా మరియు పెన్షన్ కోసం ఈ సామాజిక భద్రతా పథకాల పరిధిలోకి వచ్చేలా చేయడం మా ప్రయత్నమని గౌరవ ప్రధానమంత్రి గత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో" పేర్కొన్నట్లు సహాయమంత్రి పేర్కొన్నారు.

ఒక పార్టీలో ఓటుకు నోటు.. ఇంకో పార్టీలో సీఎం సీటుకు నోటు : విపక్షాలపై మంత్రి హరీశ్ రావు

జయశంకర్ భూపాలపల్లి, మే 9:రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్ రావు విపక్షాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ.102 కోట్లతో చేపట్టిన పలు పనులకు మంత్రి హరీశ్ రావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హరీశ్ రావు మాట్లాడారు. ఓ పార్టీలో ఓటుకు నోటు ఉంటే? ఇంకో పార్టీలో సీఎం సీటుకు నోటు ఉందని ఆయన విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కుర్చీ కోసం కొట్లాడుకుంటున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. ఒక పార్టీలో ఓటుకు నోటు పంచాయితీ ఉంటే.. ఇంకో పార్టీలో సీఎం సీటుకు నోటు పంచాయితీ ఉందని విమర్శించారు. కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రూ.2,500 కోట్లు ఇస్తే వస్తదట అంటూ హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఈ మాట మనం అనడం లేదని, కర్ణాటక బీజేపీ ఎంపీనే చెబుతున్నాడని గుర్తు చేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎవరో మీకు తెలుసన్న హరీశ్.. ఓటుకు నోటు కేసులో ఆయన ముద్దాయి అని పేర్కొన్నారు. ఇలాంటి పార్టీలతో తెలంగాణ అభివృద్ధి జరుగుతుందా ? అని హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రజలు ఇప్పటికే డిసైడ్ అయ్యారని.. మరోసారి టీఆర్ఎస్ ను గెలిపించాలని అన్నారు.

పట్టణాల ప్రగతికి నిధులు.. అభివృద్ధే టీఆర్ఎస్ ప్రధాన ధ్యేయం: ఎమ్మెల్యే రెడ్యానాయక్

వరంగల్, మే 9: పట్టణాల అభివృద్ధే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని, భవిష్యత్ కాలంలో పెరగనున్న జనాభా, పట్టణాల భౌగోళిక విస్తిర్ణతకు అనుగుణంగా తాగునీటి వసతులు కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు అమృత బిందు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు ఎమ్మెల్యే రెడ్యా నాయక్. అందులో భాగంగా మరిపెడ పట్టణానికి రూ.25కోట్లు మంజూరైనట్లు స్పష్టం చేశారు. సోమవారం ఆయన మరిపెడ మునిసిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూర రవి అధ్యక్షతన నిర్వహించిన పట్టణ కౌన్సిల్ సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గుడిపూడి నవీన్ రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మునిసిపల్ పాలక వర్గం 2021-2022 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన పట్టణ ప్రగతికి పనుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు, సిబ్బంది వేతనాల చెల్లింపులు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి ఆమోదింపజేశారు.

రాబోయే రోజుల్లో పట్టణ పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుగానే అన్ని విధాల సన్నద్ధం అవుతోందని, భవిష్యత్ రోజుల్లో ప్రజలు ఏ విధమైన ఇబ్బందులు ఎదుర్కొకుండా ఉండేందుకు తెరాసా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల భౌగోళిక విస్తిర్ణం పెరిగే క్రమంలో పుర వాసులకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా అమృత బిందు ద్వారా నూతన ఓవర్ హెడ్ ట్యాంకులు, కొత్త పైప్ లైన్లు వేయనున్నట్లు తెలిపారు. డోర్నకల్ నియోజిక వర్గంలోని రెండు మునిసిపాలిటీలకు కలిపి రూ.50కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అదే విధంగా ఈ నెల 20వ తేదీ నుంచి పట్టణ ప్రగతి కార్యక్రమం ప్రారంభం కానుందని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలకు ఉన్న సమస్యలు, రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. జాతీయ రహదారి 365 నుంచి మునిసిపల్ కార్యలయం మీదుగా తిరిగి గ్రామం బయట నేషనల్ హైవేకు కలిపే లింక్ రోడ్డును పట్టణ ప్రగతిలో భాగంగా సుమారు రూ.30లక్షల వ్యయంతో బీటీ వేయనున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ కలలను సాకారం చేస్తున్న ప్రభుత్వం : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్,మే 9: రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకం కింద చేయూతనిస్తూ దళితులను అన్ని రంగాల్లో ఎదిగేలా ప్రోత్సహిస్తుందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో దళితబంధు పథకానికి ఎంపికైన లబ్దిదారులకు కీసర మండలం చీర్యాల్‌లో జయమోహన్ గార్డెన్‌లో సోమవారం మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ. వివేకానంద్, బేతీ సుభాశ్‌రెడ్డిలు వాహనాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ కలలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకం ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. దళితుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం దేశానికే మార్గదర్శకంగా నిలిచిందిన్నారు. దళితబంధు పథకంతో దళితుల కుటుంబాలలో వెలుగులు నిండుతాయని అన్నారు.

దళితులతో పాటు ఎస్టీ, బీసీ, మైనార్టీ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. దళితబంధు పథకాన్ని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా సామాజికంగా, ఎదగాలని మంత్రి మల్లారెడ్డి కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన హోమ్ గార్డులకు ఎస్పీ సన్మానం

రాజన్న సిరిసిల్ల, మే 9:(నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డ్ లుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న భాషూ, సిహెచ్ కనకయ్యలను జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పూలమాల వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భాషూ, కనకయ్యలు హోంగార్డులుగా ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందారని అన్నారు. వెల్ఫ్ ఫేర్ నుండి భాషూ మరియు కనకయ్యలకు ఆర్థిక సహాయంగా 10,000 రూపాయల చెక్ అందచేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సేవను మరువమని, కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని హోంగార్డులకు తెలిపారు. పోలీసు రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే కాని వ్యక్తిత్వానికి కాదని అని కొనియాడారు. రిటైర్మెంట్ డబ్బులను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యాపిల్లలకు దూరంగా ఉండి డ్యూటీలు చేశారని, పదవి విరమణ చేసిన తరువాత కుటుంబ సభ్యులతో అనందంగా ఉండాలని, భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు.

ఈ కార్యక్రమంలో హోంగార్డు ఇంచార్జ్ ఆర్.ఐ యాదగిరి గారు హెడ్ కానిస్టేబుల్ రవీందర్, పౌర్ణమి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సెస్ నిధులు రూ.10 లక్షలతో నూతన పోల్స్ కు శ్రీకారం

-పనులను ప్రారంభించిన చైర్ పర్సన్, సెస్ డైరెక్టర్లు

రాజన్న సిరిసిల్ల, మే 9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలొని అన్ని వార్డులలో సెస్ నిధులు సుమారు 10 లక్షలతో నూతన పోల్స్ స్థాపనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాధవి, సెస్ డైరెక్టర్ పొలాస నరేందర్ సోమవారం 22వ వార్డులో. రెండు పొల్లకు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంబించారు. అనంతరం చైర్ పర్సన్ మాధవి మాట్లాడుతూ

పట్టణంలో తుప్పు పట్టిన ఇనుప పోల్లు ,హైటు తక్కువగా ఉన్న పొల్లను తొలగించి, లూజు లైన్ల మధ్యన కొత్త పోల్స్ వెయుటకు ప్రణాళికలు రూపొందించమన్నారు. సెస్ డైరెక్టర్ పొలాస నరేందర్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ కూడా తుప్పు పట్టిన ఇనుప పొల్లు, హైటు తక్కువ ఉన్న పోల్స్,లూజు లైన్స్ లేకుండా చూస్తామని, విద్యుత్ సరఫరాలో ఎ ఇబ్బందులు కలుగకుండా చూస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో

గడ్డం హనుమాండ్లు, మార్కెట్ చెర్మెన్, పుల్కం రాజు టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు ఇప్పపూల అజయ్, గూడూరి మధు, నరాల శేఖర్, కొండ నర్సయ్య, కొండ కనుకయ్య, మారం కుమార్, నీలం శేఖర్, కందుల క్రాంతి కుమార్, నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్, టిఆర్ఎస్ నాయకులు మల్లేశం, ఎండి పీర్ మహ్మద్, రాపెల్లి శ్రీధర్, శ్రీరాములు, సెస్ అధికారులు ఎడిజి సత్తయ్య, ఎఇఎ శుష్మా, లైన్ ఇన్స్పెకర్ కె.తిరుపతి, లైన్ మెన్లు వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి -జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, మే 9:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల ప్రతినిధి వేములవాడ, మే 9: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కంట్రోల్ బూత్ ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, పోలీస్ అధికారులతో కలసి ప్రారంభించారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్ల మీద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల సౌకర్యర్థం పట్టణంలో ఎనిమిది ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ కంట్రోల్ బూత్ లను ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. బస్టాండ్ ప్రాంతంలో పోలీస్ రేలేటెడ్ సమస్యలు ఉన్నా, ఇతర సమస్యలు ఉన్నా ప్రజలు, ప్రయాణికులు బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న ట్రాఫిక్ కంట్రోల్ బూత్ ని సంప్రదించవచ్చు అని అన్నారు. జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకై అవగాహన కార్యక్రమాలు నిరహిస్తున్నాం అని అన్నారు. వాహనాలుదారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్,సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను, ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ శాఖ వారికి సహకరించాలని కోరారు. వాహనదారులు తమ యొక్క వాహనాలపై ఉన్న ట్రాఫిక్ ఈ- చాలన్స్ ను సకాలంలో చెల్లించాలని కోరారు. మూడు కంటే ఎక్కువగా ట్రాఫిక్ ఈ-చాలన్స్ పెండింగ్ లో ఉన్న వాహనాలు జిల్లా వ్యాప్తంగా గుర్తించడం జరిగిందని, సదరు వాహనదారులు సకాలంలో తమ యొక్క పెండింగ్ ఈ-చాలాన్స్ ను చెల్లించ లేనిపక్షంలో సదరు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరు కూడా ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీస్ వారికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్, సిఐలు అనిల్ కుమార్, ఉపేందర్, లీట్స్ ఫేస్ కంపెని ఏండి నాగేశ్వరరావు, ఎస్ఐలు పరుశురాం, రాజు, స్థానిక కౌన్సిలర్ పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.